తాను కష్టాలలో ఉన్నప్పుడు
కూడా
నవ్వగలిగే వారు
నాకు ఆదర్శం

తాను ఆపదలో ఉన్నప్పుడు
కూడా
ఇతరులకు సహాయం
చేయగలిగే వారు
నాకు స్ఫూర్తి


# DD9 వార్త
తెలుగు దినపత్రిక


ఊపిరిపీల్చుకోవడానికి వెనక్కి తగ్గుతున్నా..


6


సంపుటి : 02 సంచిక : 276 హైదరాబాద్, మే, బుధవారం 06, 2026 పేజీలు : 06 వెల : 3.00


## యూరియాపై బ్యాన్ ఏంటి?..
# రైతుల ఉసురు పోసుకోకండి

**తెలంగాణలో యూరియా అమ్మకాలపై అప్రకటిత నిషేధం ఉందని హరీష్ రావు ఆరోపణ**
**రైతులకు ఎరువులు అందకుండా ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు ఇచ్చిందని విమర్శ**
**స్టాక్ ఉన్నా డీలర్లు, అగ్రో సెంటర్లలో యూరియా ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్న**
**చెరకు, పండ్ల తోటలు, కూరగాయల రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన**
**రైతు సమస్యలు పరిష్కరించాల్సింది పోయి ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ**
**కొత్త యాప్ రైతులకు ఉపయోగం కాకుండా శాపంగా మారిందని వ్యాఖ్య**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా అమ్మకాలపై అప్రకటిత నిషేధం విధించడం చరిత్రలో ఎన్నడూ లేని దిక్కుమాలిన చర్య అని ఆయన మండిపడ్డారు. మంగళవారం హరీష్ రావు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. రాష్ట్రంలో స్టాక్ ఉన్నప్పటికీ డీలర్లు, అగ్రో సెంటర్లు, సొసైటీల్లో రైతులకు యూరియా ఎందుకు ఇవ్వడం లేదని ..మిగతా 2లో

# మోడీ హైదరాబాద్ పర్యటనకు
# కట్టుదిట్టమైన భద్రత

**అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సీఎస్ ఆదేశాలు**
**భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచనలు**
**ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశం**
**కాన్వాయ్ మార్గాల్లో రోడ్ల స్థితిగతుల పరిశీలనకు ఆదేశాలు**
**అవసరమైన చోట వెంటనే మరమ్మతులు**
**పూర్తి చేయాలని జీహెచ్ఎంసీకి సూచనలు**
**అగ్నిమాపక, వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని స్పష్టీకరణ**
**పర్యటన ప్రాంతాల్లో నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు**
**పోలీసు, ఫైర్, వైద్య శాఖల మధ్య సమన్వయం కీలకమని వ్యాఖ్య**
**ఉన్నతాధికారుల సమక్షంలో ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
హైదరాబాద్‌కు ఈనెల 10న రానున్న ప్రధానమంత్రి మోడీ పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో సీఎస్ రామకృష్ణారావు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.
ప్రధాని పర్యటన సందర్భంగా భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎస్ స్పష్టం చేశారు. ముఖ్యంగా కాన్వాయ్ కదలికలు జరిగే మార్గాల్లో పోలీసు బలగాలను సమర్థంగా మోహరించాలని, ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
కాన్వాయ్ వెళ్లే రహదారులను సమగ్రంగా పరిశీలించి, ఎక్కడైనా గుంతలు లేదా దెబ్బతిన్న భాగాలు ఉంటే వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. పర్యటన జరిగే ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు.
అగ్నిమాపక శాఖ, వైద్యారోగ్య శాఖలు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సీఎస్ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా అంబులెన్సులు, ఫైర్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని చెప్పారు. అదే విధంగా విద్యుత్ శాఖ నిరంతరాయ సరఫరా కల్పించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పరం సమన్వయంతో పని చేస్తేనే ప్రధాని పర్యటన విజయవంతంగా నిర్వహించగలమని సీఎస్ రామకృష్ణారావు పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని తమ శాఖల చర్యలపై వివరాలు వెల్లడించారు.



## కాళేశ్వరం విచారణపై
# బీజేపీ డబుల్ గేమ్

**కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు**
**బీజేపీ-బీఆర్ఎస్ మధ్య అవగాహన ఉందా ? అంటూ అనుమానం**
**రాష్ట్రంలో కాంగ్రెస్ రైతు సంక్షేమం కోసం ఎంతో చేస్తోంది**
**బెంగాల్ ఎన్నికల ఫలితాలపై సంచలన ఆరోపణలు**
**ప్రజలు ఓటు హక్కును కాపాడుకోవాలని పిలుపు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ బీజేపీ మరియు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈనెల 10వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్‌కు రానున్న నేపథ్యంలో, కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీబీఐ విచారణ చేపడతారా లేదా అనే అంశంపై కేంద్రం ముందుగానే స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని తమ పార్టీ గతంలోనే ఆరోపించిందని, ఈ మేరకు సీబీఐ విచారణ కోరుతూ లేఖ కూడా రాసినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు ..మిగతా 2లో

# కమ్యూనిస్టుల
# కంచుకోటలకు బీటలు..

**కమ్యూనిస్టులకు దేశవ్యాప్తంగా కాలం చెల్లిందని రఘునందన్ రావు వ్యాఖ్య**
**ఖమ్మంలో ఎర్ర జెండా తొలగించి కాషాయ జెండా ఎగరేయాలని పిలుపు**
**'ఫసల్ బీమా'ను అమలు చేయక కాంగ్రెస్ రైతులతో చెలగాటం ఆడుతోందని విమర్శ**
**ఖమ్మం పర్యటనలో బీజేపీ సభకు స్వయంగా వాల్ పెయింటింగ్ చేసిన ఎంపీ**
**ఈ నెల 10న సికింద్రాబాద్‌లో మోదీ సభ విజయవంతం చేయాలని కోరింపు**
**దేశ, రాష్ట్ర రాజకీయాలపై ఎంపీ ఆసక్తికర వ్యాఖ్యలు**




**హైదరాబాద్, (డిడి9 వార్త):**
దేశవ్యాప్తంగా కమ్యూనిస్టులకు కాలం చెల్లిందని, ఖమ్మం జిల్లాలో కూడా ఎర్ర జెండాను తరిమికొట్టి కాకతీయ గడ్డపై కాషాయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జాతీయ నాయకులు, మెదక్ ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం నగరంలో పర్యటించిన ఆయన.. రాష్ట్రంలో 'ఫసల్ బీమా' పథకాన్ని అంగీకరించకుండా రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ..మిగతా 2లో

# ఓడితే ఓట్ చోరీ.. గెలిస్తే ప్రజాస్వామ్యమా?

**ఈ నెల 10న రాష్ట్రానికి వచ్చే మోదీకి స్వాగతం పలకాలన్న బీజేపీ చీఫ్**
**ఓట్ చోరీ జరిగిందని మమతా బెనర్జీ అంటే, రాహుల్ సమర్థించడం విడ్డూరమని వ్యాఖ్య**
**ప్రజాస్వామ్యంలో ప్రజాతీర్పు సమర్థవంతమైనదన్న రామచందర్ రావు**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
మమతా బెనర్జీ, రాహుల్ గాంధీలు గతంలో ఓట్ చోరీ చేసే ఎన్నికల్లో గెలిచారా? అని తెలంగాణ బీజేపీ ..మిగతా 3లో



# రైతు సమస్యలపై ప్రభుత్వానికి
# కేటీఆర్ అల్టిమేటం

**జనగామలో కేటీఆర్ పర్యటన.. బీఆర్ఎస్ శ్రేణుల స్వాగతం**
**యశ్వంతపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన**
**కొనుగోలు జాప్యంపై రైతుల ఆవేదన.. మార్క్‌ఫెడ్‌కు కేటీఆర్ ఫోన్**
**రాష్ట్ర ప్రభుత్వానికి కేటీఆర్ అల్టిమేటం.. ఉద్యమ హెచ్చరిక**


**హైదరాబాద్, (డిడి9 వార్త):**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. అనంతరం జనగామ మండలంలోని యశ్వంతపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ సందర్శించారు. అక్కడ రైతులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోందని రైతులు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. 15 నుంచి 20 రోజులుగా ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కేటీఆర్, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో ..మిగతా 2లో

# మాది రైతు సంక్షేమ ప్రభుత్వం

అన్నదాతలకు పక్షపాత ప్రభుత్వం: పొంగులేటి
రుణమాఫీపై గత ప్రభుత్వంపై విమర్శలు
రూ.21 వేల కోట్ల రుణమాఫీ చెల్లించాం
వరి రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్
ఎకరానికి రూ.12 వేల ఆర్థిక సాయం
వ్యవసాయ పరికరాల పంపిణీపై హామీ
కేంద్ర మ్యాచింగ్ గ్రాంట్‌కు రాష్ట్రం నుంచి నిధులు
రైతును రాజు చేయడమే లక్ష్యమని వ్యాఖ్య
ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా భారీ కార్యక్రమం



**హనుమకొండ, (డిడి9 వార్త):**
హనుమకొండలో నిర్వహించిన మెగా రైతు మేళా కార్యక్రమం రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా వ్యవసాయ రంగంలోనూ ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఈ భారీ రైతు మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం, ప్రభుత్వ విధానాలు వంటి అంశాలపై విశదీకరణ జరిగింది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రైతు అనుకూల చర్యలను ప్రజలకు వివరించే వేదికగా ఇది మారింది.
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమాన్ని ప్రధాన అజెండాగా తీసుకుని ముందుకు సాగుతున్నామని తెలిపారు. రైతుల అభివృద్ధి లేకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం ..మిగతా 2లో



# రాజీనామా చేయను

**మొండికేసిన మమతా బెనర్జీ**
**బెంగాల్ ఎన్నికల్లో ఎన్నో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణ**
**బీజేపీతో కాదు.. ఎన్నికల సంఘంతో పోరాటమని వ్యాఖ్య**
**సీఎం పదవి నుంచి తప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం**
**కుట్ర కారణంగానే ఓటమి జరిగిందని ఆరోపణ**
**ఇండియా కూటమి బలోపేతానికి కృషి చేస్తానని హామీ**
**ఈవీఎంల తారుమారుపై సంచలన వ్యాఖ్యలు**
**ఓటర్ల జాబితా నుంచి లక్షల పేర్లు తొలగించారని ఆరోపణ**
**ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని విమర్శ**
**ఎన్నికల అనంతర హింసపై నిజనిర్ధరణ కమిటీ ఏర్పాటు**
**ప్రజాస్వామ్యానికి ఇది చీకటి అధ్యాయం అని వ్యాఖ్య**

2

# కాళేశ్వరం విచారణపై బీజేపీ డబుల్ గేమ్

మొదటిపేజీ తరువాయి



దర్యాప్తు ప్రారంభం కాకపోవడంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ, ఎందుకు సీబీఐ విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ పై మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. ఆయన తన బాధ్యతలను మర్చిపోయి రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో సీబీఐ విచారణ ఎందుకు జరగడం లేదో బండి సంజయ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల ముందు బీజేపీ నేతలే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపించారని, ఇప్పుడు అదే విషయంపై మౌనం పాటించడం ఎందుకని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య అంతర్గత అవగాహన ఉందనే అనుమానాలను ఆయన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతల మద్దతు లేకుండా బీజేపీకి రాష్ట్రంలో ఎనిమిది లోక్‌సభ స్థానాలు వచ్చేవా అని ప్రశ్నించారు. అలాగే హరీష్ రావు మద్దతు లేకుండా మెదక్‌లో బీజేపీ అభ్యర్థి గెలిచేవారా అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం అంశంపై సీబీఐ విచారణ చేపట్టకపోవడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయనే సందేహం వ్యక్తం చేశారు.రైతు అంశాలపై కూడా మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. గతంలో "వరి వేస్తే ఉరి" అన్నది బీజేపీ నాయకులేనని, ఇప్పుడు రైతుల కోసం కంటతడి పెట్టడం రాజకీయ నాటకమని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, రైతుబంధు, బోనస్ వంటి పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. మక్కలు కొనుగోలు చేయడం ద్వారా కూడా రైతులకు మద్దతు ఇస్తున్నామని పేర్కొన్నారు.

పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలపై కూడా ఆయన సంచలన ఆరోపణలు చేశారు. అక్కడ బీజేపీకి అనుకూల పరిస్థితులు లేవని, ఓటు చోరీ ద్వారా గెలిచిందని ఆరోపించారు. దాదాపు 90 లక్షల ఓట్లను తొలగించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ ఓటు హక్కును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాల్లో ప్రతిపక్ష నేతలపై కేసులు నమోదు చేస్తోందని, అయితే అదే సమయంలో తెలంగాణలో కేసీఆర్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మమతా బెనర్జీ, అర్వింద్ కేజ్రీవాల్ లపై కేసులు పెట్టిన కేంద్రం, కేసీఆర్ విషయంలో ఎందుకు మౌనం పాటిస్తోందని నిలదీశారు. మొత్తంగా, బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నందున తలచుకుంటే వెంటనే సీబీఐ విచారణ చేపట్టగలదని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. కానీ ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ లాభనష్టాలే కారణమని ఆరోపించారు. ఈ అంశంపై కేంద్రం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ఆయన

# రాజీనామా చేయను

- మొండికేసిన మమతా బెనర్జీ
- బెంగాల్ ఎన్నికల్లో ఎన్నో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణ
- బీజేపీతో కాదు.. ఎన్నికల సంఘంతో పోరాటమని వ్యాఖ్య
- సీఎం పదవి నుంచి తప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం
- కుట్ర కారణంగానే ఓటమి జరిగిందని ఆరోపణ
- ఇండియా కూటమి బలోపేతానికి కృషి చేస్తానని హామీ
- ఈవీఎంల తారుమారుపై సంచలన వ్యాఖ్యలు
- ఓటర్ల జాబితా నుంచి లక్షల పేర్లు తొలగించారని ఆరోపణ
- ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని విమర్శ
- ఎన్నికల అనంతర హింసపై నిజనిర్ధరణ కమిటీ ఏర్పాటు
- ప్రజాస్వామ్యానికి ఇది చీకటి అధ్యాయం అని వ్యాఖ్య

**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సంచలనంగా మారిన ఎన్నికల ఫలితాలపై తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో తాము భారతీయ జనతా పార్టీతో కాకుండా ఎన్నికల సంఘంతో పోరాడాల్సి వచ్చిందని ఆమె ఆరోపించారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి ఎన్నికలను ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే విధంగా ఎన్నికల ప్రక్రియ సాగిందని విమర్శించారు.

ఫలితాల అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తాము ప్రజల తీర్పుతో ఓడిపోలేదని, కుట్రపూరిత చర్యల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత లేకపోవడమే తమ ఓటమికి కారణమని ఆమె అభిప్రాయపడ్డారు.

ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల వినియోగంపై ఆమె తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత కూడా ఈవీఎంలలో 8090 శాతం చార్జ్ ఉండడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఇది సాధారణ పరిణామం కాదని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈవీఎంలను తారుమారు చేశారనే అనుమానాలను ఆమె వ్యక్తం చేశారు.

ఓటర్ల జాబితాలో భారీగా మార్పులు జరిగాయని కూడా ఆమె ఆరోపించారు. ఎస్ఐఆర్ పేరుతో దాదాపు 90 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారని చెప్పారు. తాము కోర్టును ఆశ్రయించిన తర్వాత 32 లక్షల పేర్లను తిరిగి చేర్చారని వెల్లడించారు. ఇది ఎన్నికల ప్రక్రియలో జరిగిన తీవ్రమైన లోపాలను సూచిస్తుందని అన్నారు.

ఎన్నికలకు ముందు తమ పార్టీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని అరెస్టులు జరిగాయని మమతా బెనర్జీ ఆరోపించారు. అనేక ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారని, కీలక అధికారులను బదిలీ చేశారని తెలిపారు. ఐపీఎస్, ఐఏఎస్ అధికారులను మార్చడం ద్వారా పరిపాలనా వ్యవస్థను ప్రభావితం చేశారని విమర్శించారు. ఎన్నికల సంఘం, బీజేపీ కలిసి పనిచేసినట్లు అనిపించిందని వ్యాఖ్యానించారు.

ఓట్ల లెక్కింపులో కూడా భారీ అవకతవకలు జరిగాయని ఆమె ఆరోపించారు. దాదాపు 100 స్థానాల్లో తమ పార్టీ గెలుపును కాజేశారని అన్నారు. లెక్కింపు ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా నెమ్మదిగా నిర్వహించి టీఎంసీ శ్రేణుల మనోధైర్యాన్ని దెబ్బతీశారని పేర్కొన్నారు. ఈ పరిణామాలను చరిత్రలో చీకటి అధ్యాయంగా ఆమె అభివర్ణించారు. ఎన్నికల అనంతర హింసపై కూడా ఆమె స్పందించారు. ప్రభావిత ప్రాంతాలను సందర్శించి వాస్తవ పరిస్థితులను అంచనా వేయడానికి 10 మంది సభ్యులతో కూడిన నిజనిర్ధరణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇదే సమయంలో 2021లో ఎన్నికల అనంతరం హింస జరిగిందన్న ఆరోపణలను ఆమె ఖండించారు. ఆ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేశారు. రాజకీయంగా తమ పార్టీని దెబ్బతీయడానికి అవి చేయబడిన ప్రయత్నాలేనని పేర్కొన్నారు. ఈ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా పలువురు ప్రతిపక్ష



నేతలు తనకు మద్దతుగా నిలిచారని మమతా తెలిపారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్ తదితరులు ఫోన్ ద్వారా సంఘీభావం తెలిపారని చెప్పారు. ఈ మద్దతు తమకు మరింత బలం ఇస్తుందని అన్నారు.

భవిష్యత్తులో 'ఇండియా' కూటమిని బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తామని ఆమె వెల్లడించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాటంలో తమ పార్టీ ముందుంటుందని స్పష్టం చేశారు. దేశ రాజకీయాల్లో మార్పు తీసుకురావడానికి ప్రతిపక్షాలు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు. మొత్తంగా, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలపై మమతా బెనర్జీ చేసిన ఈ ఆరోపణలు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల నిర్వహణ, పారదర్శకత, ప్రజాస్వామ్య విలువలపై మళ్లీ ప్రశ్నలు లేవనెత్తాయి. ఈ పరిణామాలు భవిష్యత్తులో రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముంది.



## రైతు సమస్యలపై ప్రభుత్వానికి కేటీఆర్ అల్టిమేటం

మొదటిపేజీ తరువాయి

మాట్లాడి, మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో సుమారు 14 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పండించారని, అయితే ఆ మేరకు కొనుగోలు ప్రణాళికలు రూపొందించలేదని ఆరోపించారు. ప్రభుత్వం కేవలం 10 లక్షల టన్నుల పంటను మాత్రమే కొనుగోలు చేయాలని భావిస్తోందని, మిగతా పంటను నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. పంటను కొనుగోలు చేయకుండా ఆలస్యం చేయడం వల్ల వర్షాల కారణంగా పంట దెబ్బతింటుందని, దీంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. అలాగే మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.22,000 కోట్ల అప్పులు తీసుకువచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాల కారణంగా అక్కడి నుంచి నిధులు రాకపోవడంతో, మార్క్‌ఫెడ్ నిధులను వాడుకుంటున్నారని చెప్పారు. తాను చెప్పిన లెక్కలు తప్పైతే ప్రభుత్వం రుజువు చేయాలని సవాల్ విసిరారు.

రైతులను ఇలాగే ఇబ్బందులకు గురి చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని కేటీఆర్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, రేపటి వరకు గడువు ఇస్తున్నామని తెలిపారు. లేకపోతే రైతుల తరపున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

## యూరియాపై బ్యాన్ ఏంటి?..
# రైతుల ఉసురు పోసుకోకండి

మొదటిపేజీ తరువాయి



హరీష్ రావు ప్రశ్నించారు. "యూరియా అమ్మకాలు నిలిపివేయాలని ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు ఇవ్వడం దారుణం. చెరకు, పండ్ల తోటలు, కూరగాయలు పండించే రైతులు ఎరువుల కోసం అల్లాడుతుంటే ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదా?" అని నిలదీశారు. ఎరువుల కష్టాలను తీర్చాల్సింది పోయి, కొత్తగా తెచ్చిన యాప్ రైతుల పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**రైతు డిక్లరేషన్ 'అట్టర్ ఫ్లాప్'..**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి విషయంలోనూ విఫలమైందని హరీష్ రావు విమర్శించారు. రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వైఫల్యాలను ఆయన ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు. రైతు బంధు ఇవ్వడంలో, రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయ్యింది. పంటలకు బోనస్ చెల్లించడంలో, పంట బీమా పథకం అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ధాన్యం కొనుగోళ్లలో విఫలమై రైతులను ఆందోళనలోకి నెట్టారు. యూరియా సరఫరాను పక్కనపెట్టి, వినియోగం తగ్గించాలంటూ ప్రచారం చేయడం హాస్యాస్పదమని పేర్కొన్నారు.

**వారోత్సవాల పేరిట డ్రామాలు..**

"ఒకవైపు రైతులు కష్టాల్లో ఉంటే, మరోవైపు ప్రభుత్వం వారోత్సవాలు నిర్వహించడం వారిని అవమానించడమే. ఈ వైఫల్యాలను కవర్ చేసుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం డ్రామాలు చేస్తోంది. రైతుల ఉసురు పోసుకుంటున్న పాపం ఈ ప్రభుత్వానికి తగలకుండా పోదు" అని హరీష్ రావు ఘాటుగా వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో రైతుల నిలదీతకు భయపడి అధికారులు రైతు వేదికల నుంచి పారిపోయే పరిస్థితి రావడం పాలనా వైఫల్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో మాదిరిగా నిరంతరం యూరియా అమ్మకాలు కొనసాగించాలని, వెంటనే అనధికారిక బ్యాన్‌ను ఎత్తివేసి రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# మాది రైతు సంక్షేమ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

కాదని పేర్కొన్నారు.

రుణమాఫీ అంశంపై మంత్రి గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయడానికి గత ప్రభుత్వం పదేళ్ల సమయం తీసుకుందని, అది రైతుల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా అడుగులు వేస్తోందని చెప్పారు.

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని భారీ అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించిన మంత్రి, అయినప్పటికీ తమ ప్రభుత్వం రైతులకు రూ.21 వేల కోట్లు చెల్లించిందని వివరించారు. ఈ చెల్లింపులు రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించాయని చెప్పారు. రైతులపై ఉన్న అప్పు భారాన్ని తగ్గించడమే తమ లక్ష్యమని తెలిపారు.

వరి సాగుపై గత ప్రభుత్వ వైఖరిని కూడా ఆయన విమర్శించారు. అప్పట్లో వరి వేస్తే ఉరి అన్న పరిస్థితి నెలకొల్పారని వ్యాఖ్యానించారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పూర్తి మద్దతు అందిస్తోందని స్పష్టం చేశారు. వరి రైతులకు కనీస మద్దతు ధర కల్పించడమే కాకుండా సన్న వడ్లకు రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. దీని వల్ల రైతులకు గణనీయమైన లాభం చేకూరుతోందని చెప్పారు.

రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. ప్రతి ఎకరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ సాయం రైతులకు విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. రైతుల ఉత్పత్తి ఖర్చులు తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

వ్యవసాయ పరికరాల పంపిణీ అంశాన్ని కూడా మంత్రి ప్రస్తావించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు రైతులకు పరికరాలు అందిస్తున్నామని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయంలోకి తీసుకురావడం ద్వారా ఉత్పాదకతను పెంచడమే లక్ష్యమని తెలిపారు. రైతులు సాంకేతికతను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌పై కూడా మంత్రి స్పందించారు. కేంద్రం ఇచ్చే గ్రాంట్‌కు రాష్ట్రం నుంచి రూ.1200 కోట్లు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఎలాంటి రాజీ పడకుండా నిధులు వెచ్చిస్తోందని పేర్కొన్నారు. కేంద్రరాష్ట్ర సమన్వయంతో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు.రైతులను రాజులుగా నిలబెట్టడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. రైతును రాజు చేసే వరకు విశ్రమించబోమని స్పష్టం చేశారు.

ఈ మెగా రైతు మేళా కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు రైతులకు ప్రత్యక్షంగా చేరేలా అవగాహన కల్పించారు. పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్న ఈ కార్యక్రమం రైతు సంక్షేమంపై ప్రభుత్వ కట్టుబాటును ప్రతిబింబించింది. వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించనుందని అధికారులు పేర్కొన్నారు.



# కమ్యూనిస్టుల కంచుకోటలకు బీటలు..

మొదటిపేజీ తరువాయి

తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ నగరంలో ఆయన స్వయంగా వాల్ పెయింటింగ్ వేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర రాజకీయాలపై, అలాగే రైతాంగ సమస్యలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

దేశవ్యాప్తంగా ఎక్కడ ఎన్నికలు జరిగినా ప్రజల తీర్పు అభివృద్ధి, విశ్వాసం, మంచి పరిపాలన వైపే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అహంకారంతో, కుటుంబ పాలనతో, వ్యక్తి ఆరాధనతో దేశాన్ని పక్కనపెట్టి కేవలం తమ కుటుంబాలు మాత్రమే బాగుండాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ప్రతి పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతున్నారని పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడు వరకు జరుగుతున్న పరిణామాలు వివరిస్తున్నాయన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు 'ఇండియా' కూటమి పేరుతో కపట నాటకాలు ఆడుతున్నాయని, ఆ రెండు పార్టీలు కలిసికట్టుగా ఉన్నట్లు నటిస్తున్నప్పటికీ కేరళ రాష్ట్రానికి వచ్చేసరికి ఒకరిపై ఒకరు పోరాడుకుంటూ తమ మధ్య ఎలాంటి ఐక్యత లేదని నిరూపించుకున్నాయని ఎద్దేవా చేశారు. ప్రజలు ఈ రెండు పార్టీలను తిరస్కరిస్తున్నారని, గుజరాత్, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి వంటి రాష్ట్రాల్లో మోదీ నాయకత్వంలో బీజేపీ సాధించిన విజయాలే ఇందుకు నిదర్శనమని ఆయన గుర్తుచేశారు.

ప్రధాని మోదీ ప్రతి రాష్ట్రాన్ని సమానంగా చూస్తూ కక్ష సాధింపు చర్యలకు తావులేకుండా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల అవలంబిస్తున్న తీరును రఘునందన్ రావు తీవ్రంగా తప్పు పట్టారు. రాష్ట్రంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటీవల జరిగిన అగ్నిప్రమాదాల్లో సుమారు 200 ఎకరాల వరి పంట బూడిదపాలై రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం గనక రాష్ట్రంలో అమలులో ఉండి ఉంటే ఖమ్మం రైతులకు ఎంతో మేలు జరిగి ఉండేదని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ పథకాన్ని అంగీకరించకపోవడం వల్లనే రైతులకు నష్టపరిహారం అందక ఈ దుస్థితి దాపురించిందని విమర్శించారు. రైతుల జీవితాలతో, రాష్ట్ర అభివృద్ధితో రాజకీయాలు చేయవద్దని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వానికి హితవు పలికారు. రైతులను గౌరవించిన చోటనే ఆ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆయన స్పష్టం చేశారు.

రాబోయే శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ఏకైక లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 1980లో దేశవ్యాప్తంగా బీజేపీకి కేవలం ఇద్దరు ఎంపీలు గెలిచినప్పుడు అందులో ఒకరు తెలంగాణలోని హనుమకొండ గడ్డ మీద నుంచి గెలిచిన విషయాన్ని, ఆనాటి పోరాట స్ఫూర్తిని ఆయన గుర్తు చేశారు. అంగ, వంగ, కళింగ దేశాలను గెలుచుకున్న తర్వాత ఇక మిగిలింది కాకతీయ సామ్రాజ్యమేనని, ఈ గడ్డపై కూడా కచ్చితంగా కాషాయ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. దేశంలో ఎక్కడా కనిపించని ఎర్ర జెండా ఖమ్మం జిల్లాలో కూడా కనిపించవద్దని, దేశ ప్రజలు వదిలించుకున్న వామపక్షాలను ఖమ్మం ప్రజలు కూడా వదిలించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మార్పు కోసం, ఖమ్మం జిల్లా బాగు కోసం కమలం గుర్తుకు ఓటు వేసి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరచాలని రఘునందన్ రావు ప్రజలను కోరారు. ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో సాయంత్రం జరిగే ప్రధాని మోదీ సభకు



పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, రాష్ట్ర నాయకులు గోంగూర వెంకటేశ్వరరావు, మందడం సుబ్బారావు, రుద్ర ప్రదీప్, నాయుడు రాఘవరావు, అల్లిక అంజయ్య, సైదేశ్వర రావు, బోయల వెంకట్, మంద సరస్వతి,బండారు నరేష్, ఆర్ వి ఎస్ యాదవ్, గడిల నరేష్, ధనియాకుల వెంకటనారాయణ, శ్రీరామనేని మణి, మార్తి వీరభద్ర ప్రసాద్,దార్ల మల్లేశ్వరి,గుత్తావంశీ,రీగన్,పాలెపు రాము తదితరులు పాల్గొన్నారు.

## ఓడితే ఈవీఎంలు.. గెలిస్తే ప్రజాస్వామ్యమా?

**మొదటిపేజీ తరువాయి**



అధ్యక్షుడు రామచందర్ రావు ప్రశ్నించారు. ఈరోజు హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ, యావత్ ప్రపంచం ఆర్థికమాంద్యంలో కొట్టుమిట్టాడుతుంటే మోదీ ఆధ్వర్యంలో భారతదేశం ప్రగతి పథంపై పరుగులు పెడుతోందని అన్నారు. ఈ నెల 10వ తేదీన రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీకి ప్రజలు ఘన స్వాగతం పలకాలని కోరారు.
బెంగాల్‌లో 100 సీట్లలో ఓటు చోరీ జరిగిందని మమతా బెనర్జీ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. వీళ్లకు ఓటు చోరీ అలవాటు కాబట్టే అప్పుడు గెలిచారని చురక అంటించారు. ఎన్నికల్లో ఓడిపోతే ప్రజల తీర్పును అంగీకరించాలని, కానీ ప్రజలను అవమానపరిచే మాటలు సరికాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పు సర్వశక్తిమంతమైనదని అన్నారు. ప్రజాతీర్పును మమతా బెనర్జీ అవమానిస్తుంటే కాంగ్రెస్ మద్దతు తెలపడం విడ్డూరమని మండిపడ్డారు. మూడుసార్లు మమతా బెనర్జీ గెలిచినప్పుడు తాము ఏమీ అనలేదని, ప్రజాతీర్పును గౌరవించామని అన్నారు. కానీ వాళ్లు ఓడిపోతే మాత్రం ఈవీఎంలను తప్పుబడుతున్నారని మండిపడ్డారు. ఈసీఐని, దేశాన్ని నిందించడం ఏమిటని రామచందర్ రావు ప్రశ్నించారు.



## ప్రమాదవశత్తు కాలిపోయిన పంట పొలాలను పరిశీలించిన బోథ్ MLA శ్రీ. అనిల్ జాదవ్..!!

- **రైతులు అధైర్య పడొద్దు అండగా ఉంటాము**
- **ప్రభుత్వ పరంగా పంట నష్టపరిహారం అందేవిధంగా చేస్తాను.!!**

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 05(డి డి 9 వార్త ):-**

ఈ రోజు బోథ్ మండలంలోనీ కన్గుట్ట గ్రామంలో అధికారులతో కలిసి పర్యటించిన గౌరవ బోథ్ MLA అనిల్ జాదవ్. మొన్న మధ్యాహ్నం ప్రమాదవశత్తు జరిగిన అగ్ని ప్రమాదానికి దాదాపు 80 ఎకరాల వరకు మక్కా జొన్న,జొన్న పంట కాలి భూడిది కావడం చాలా బాధాకరం అని అన్నారు, రైతులు ఎవరు కూడా అధైర్య పడవద్దు అందరికి అండగా ఉంటాము అని అన్నారు. ప్రభుత్వం కూడా స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి అని అన్నారు.ఈ కార్యక్రమం మండల నాయకులు సంబంధిత శాఖ అధికారులు BRS పార్టీ కార్యకర్తలు ఉన్నారు.





## రాజురా రైతులకు 1కోటి 18 లక్షల భూ నష్టపరిహారం అందించిన గౌరవ బోథ్ MLA శ్రీ. అనిల్ జాదవ్ .!!

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 05(డి డి 9 వార్త ):-**

ఈ రోజు నేరడిగొండ మండలంలోని రాజురా గ్రామంలో 2012 లో నిర్మానించిన చెరువు వల్ల భూమి కోల్పోయిన రైతులకు మొదటి విడతగా నాటి కెసిఆర్ గారి ప్రభుత్వ హయం 2014లో 50% నిధులు విడుదల చేయగా నేడు రెండవ విడతగా గౌరవ బోథ్ MLA శ్రీ. అనిల్ జాదవ్ గారు అసెంబ్లీ లో ప్రస్థావించడం వల్ల నేడు రాజురా రైతులకు 1 కోటి 18 లక్షల రూపాయలు రైతులకు నష్ట పరిహారం అందడంతో స్థానిక రైతులు గౌరవ బోథ్ శాసన సభ్యులు శ్రీ. అనిల్ జాదవ్ గారికి కృతజ్ఞతలు తెలిపారు.!!* ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, నాయకులు,రైతులు గ్రామస్థులు తదితరులు ఉన్నారు.







## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రైతులకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేసిన హార్టికల్చర్ అధికారులు...

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 05(డి డి 9 వార్త ):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నేడు హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ పంటల గురించి ప్రభుత్వం ద్వారా వస్తున్న పథకాల గురించి బోథ్ నియోజకవర్గ కేంద్రం లోని హనుమాన్ నగర్ వద్ద గల భగవాన్ రెడ్డి ఆయిల్ ఫామ్ వ్యవసాయ క్షేత్రం లో రైతులకు పెద్ద ఎత్తున అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పెద్ద ఎత్తున హాజరైన రైతులకు శాస్త్ర వేత్తలు, ఉద్యానవన, పట్టు పరిశ్రమ ల శాఖ అధికారులు ఆయిల్ ఫామ్ పంట పండించే విధానం అలాగే పండించడం వలన వచ్చే లాభాలా గురించి వివరంగా తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని సబ్సిడీలు అన్ని ఎత్తేసి రైతులకు తీవ్ర భారం మోపిందని వరి ఏస్తే ఉరి అనే మాటలు మాట్లాడిన చేతకాని సీఎం ప్రభుత్వం గత ప్రభుత్వం అని అన్నారు. కానీ ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కొత్తరకం పంటల గురించి అవగాహనా సదస్సు లు ఏర్పాటు చేస్తూ అధిక లాభాలు పొంది రైతు సంతోషంగా ఉండాలన్న గొప్ప ఆలోచన తో ముందుకు సాగుతుందని తెలిపారు.రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు లాంటి గొప్ప గొప్ప కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని రైతుని రాజు చేయాలన్న ఆలోచన తో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ ఆర్ చిత్రు,వెంకటేశ్వర రావు, డిఏఓ ,ఏఓ లు ఏఈ ఓ లు, హార్టికల్చర్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు అచ్యుత్, రహీమోద్దీన్, దినేష్,సన్నీ, వినయ్ రెడ్డి, గడ్డల నారాయణ,రైతులు భగవాన్ రెడ్డి, ప్రభాకర్, నర్సారెడ్డి, ఎల్టీ లింగారెడ్డి, గుండయ్య,ప్రసాద్ రెడ్డి,నారాయణ తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు

## బోరిగాం గ్రామ ప్రజల నీటి కష్టాలకు విముక్తి

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 05(డి డి 9 వార్త ):-**

మండలంలోని బోరిగాం గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిన మిషన్ భగీరథ నీటి సరఫరా సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. వేసవి తీవ్రతతో తాగునీటి కోసం గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అధికమవుతున్న నేపథ్యంలో, గ్రామ సర్పంచ్ రాథోడ్ వినీష్ వెంటనే స్పందించారు.సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గ్రామంలోని నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన, క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్‌లో ఉన్న మిషన్ భగీరథ పనులను వేగవంతం చేశారు. పైపులైన్ మరమ్మతులు, లీకేజీల నివారణ వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించడంతో గ్రామానికి మళ్లీ నీటి సరఫరా పునరుద్ధరించబడింది.దీంతో దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభించడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తక్షణ చర్యలు తీసుకుని నీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు






## పంట నష్టానికి కరంట్ డిపార్ట్మెంట్ బాధ్యత వహించాలి

- **సంగెపు బొర్రన్న**

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 05(డి డి 9 వార్త ):**

నేడు బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన పలువురు రైతులు అష్టకష్టాలు పడి ఈ యాసంగిలో పండించిన జొన్న, మొక్కజొన్న పంటలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదానికి గురైనా పంట చేనులను పరిశీలన చేసి ఇంచుమించుగా 45 ఎకరాలలో 30 ఎకరాలలో జొన్నపంట, 15 ఎకరాలలో మొక్కజొన్న పంట 300 స్పింక్లర్ పైపులు పూర్తి స్థాయిలో కాలిపోవడం మూలంగా ఆర్థికంగా నష్టపోయినా రైతులకి విద్యుత్ శాఖ వారే పంట నష్టపరిహారం అంచనా వేసి ఒక ఎకరాకి 50 వేల రుపాయల పంట నష్ట పరిహారం చెల్లించే విదంగా కృషి చేయాలనీ రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న ఒక ప్రకటనలో తెలియజేయడం జరిగింది. ఇలా ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ మండలంలోని గ్రామీణ ప్రాంతంలో సాగుచేసిన జొన్న, మొక్కజొన్న పంట దాదాపుగా 750 ఎకరాలకు పైగా పంట అగ్నికి అహుతి కావడం మూలంగా జిల్లా యంత్రాంగం జాతీయ విపత్తు కిందా పరిగణలోకి తీసుకొని నష్టపరిహారం అందించే విదంగా కృషి చేయవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. సకాలములో అగ్నిమాపక శకటలు అందుబాటులో లేపోవడంతో అతి తీవ్రంగా పంటలు కాలిపోయిన దృశ్యాలు కనిపించాయాని దీనిని జిల్లా యంత్రాంగం దృష్టిలో ఉంచుకొని పంట నష్టపోయిన రైతులకి పరిహారం ఇవ్వాలని ఆయన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఇందులో పాల్గొన్న రైతులు కిసాన్ మిత్ర ఫీల్డ్ కో ఆర్డినేటర్ షారుక్, బీమా రాజు, m గణేష్,, దాసరి స్వామి, చందు. రఘు తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం సిద్ధం: ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి

**నిజామాబాద్ జిల్లా, మే 05 (డీడీ9 వార్త) :**

రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, అన్నదాతలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం భీంగల్ లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ పట్టణ స్థాయి మీడియా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని వెల్లడించిన ఆయన, ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను రైతులు నమ్మవద్దని కోరారు. విపక్షాల బూటకపు మాటలు నమ్మి వారి ఉచ్చులో చిక్కుకోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు కన్నె సురేందర్, జేజే నర్సయ్య, ఆరెపల్లి నాగేంద్రబాబు, పర్సా అనంతరావు, మామరి సందీప్, మాలవత్ సాంగ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## నేరడిగొండలో బీజేపీ ఘనవిజయోత్సవం

- **తెలంగాణలోనూ కషాయ జెండా ఎగురవేస్తాం**

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 05(డి డి 9 వార్త )**

భారతీయ జనతా పార్టీ నేరడిగొండ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో బీజేపీ మూడు రాష్ట్రాల్లో ఘనవిజయం సాధించిన సందర్భంగా సంబరాలు మిన్నంటాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచుకుంటూ జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఆకుల రాజశేఖర్ మాట్లాడుతూ, ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బీజేపీ జెండా ఎగిరిందని, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ వంటి ప్రాంతాల్లో అరాచక పాలన అంతమై రామరాజ్యం సిద్ధించిందని హర్షం వ్యక్తం చేశారు. ఇక తదుపరి లక్ష్యం తెలంగాణే అని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రాన్ని మొత్తం కషాయమయం చేసేందుకు కార్యకర్తలు ఇప్పటి నుంచే సమరోత్సాహంతో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాదె శంకర్, మండల ఉపాధ్యక్షులు అడెపు రమేష్, గూడ రాజేందర్ రెడ్డి, రామగుండ్ల సురేష్, ప్రధాన కార్యదర్శి రజింత్, కార్యదర్శి జాదవ్ భీం రావ్, మాజీ సర్పంచ్ కోట్నాక్ కోటేశ్వర్, పరుశురాం జాదవ్, మాజీ ఎంపీటీసీ ధురువ రాజు, టౌన్ అధ్యక్షులు బాక్రె శేఖర్, సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి, సిడాం సంతోష్, ప్రణిత్ మరియు ఇతర కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# దగ్ధమైనా పంటను పరిశీలించిన నాయకులు

- రైతుల కష్టాలకు ఎప్పుడు సాయం. ఆదుకోవాలన్నా ప్రజా ప్రతినిధులు

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 05(డి డి 9 వార్త ):-**



ఈరోజు బోత్ మండలంలోని కనుగుట్ట గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన మొక్కజొన్న మరియు జొన్న పంట అగ్ని ప్రమాదం సంభవించిన సందర్భంలో ఆ గ్రామానికి వెళ్లి అగ్నికి ఆహుతి అయిన పంటలను పరిశీలించడం జరిగింది. *మాజీ దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ జీవీ రమణ గారు మాట్లాడుతూ.బోత్ మండలంలోని మరియు పొచ్చెర మరియు కనుగుట్ట గ్రామాలలో ఇలాంటి అగ్ని ప్రమాదాలు జరగడం కేవలం మండలంలోని అగ్నిమాపక కేంద్రం లేకపోవడం,నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. బోత్ కు వచ్చినప్పుడు ఎన్నికలు అయినా రెండు నెలలోనే బోత్ మండలానికి అగ్నిమాపక కేంద్రాన్ని ఇస్తానని మాట ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచిన నేటి వరకు అగ్నిమాపక కేంద్రం లేకపోవడం వలన మండలంలోని పశువుల పాకలు మరియు పంటలు అగ్నికి కాలి బూడిదై రైతులను ఎంతో నష్టపరుస్తున్నాయి . కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన క్రింద సంవత్సరానికి 5 వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన వాటిని అమలు పరచడం లేదు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన అంటే పంటలు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతే పంట నష్టపరిహారంగా ఇవ్వడం జరుగుతుంది. ఇలాంటి ఎంతో మంచి పథకాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయక రైతులను చాలా నష్టపోతున్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన అని తక్షణమే అమలు చేయాలని మరియు బోథ్ మండలానికి అగ్నిమాపక కేంద్రాన్ని తక్షణమే మంజూరు చేయాలని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి 50,000 చొప్పున ఈ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరడమైనది ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోరే రవీందర్,pAcs చైర్మన్ కదం ప్రశాంత్,గ్రామ సర్పంచ్,మరియు జిల్లా నాయకులు మండల నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు





# అగ్నిప్రమాద బాధిత రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 5(డి డి 9వార్త ):-**

అగ్ని ప్రమాదం వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా భరోసా ఇచ్చారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామంలో పర్యటించి, అగ్నిప్రమాదంలో దగ్ధమైన జొన్న, మొక్కజొన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదం జరిగిన తీరును, పంట నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. చేతికొచ్చిన పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన తెలుసుకుని సానుభూతి వ్యక్తం చేశారు. పంట నష్టంపై తక్షణమే సమగ్ర సర్వే నిర్వహించి, బాధిత రైతుల వివరాలతో నివేదిక సమర్పించాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నివేదిక ఆధారంగా నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నుంచి తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విపత్తు సమయంలో రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ ఆర్. ఎస్ చిత్రు, ఆర్డీఓ జగదీశ్వర్ రావ్, తహసీల్దార్ సుభాష్ చందర్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, బాధిత రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో చదివితేనే విజయ శిఖరాలు

- గ్రామీణ విద్యార్థుల ప్రతిభకు నిదర్శనం యామిని

**ఘట్‌కేసర్, మే 5(డీడీ9 వార్త):**



పట్టుదల, క్రమశిక్షణతో శ్రమిస్తే రాష్ట్రంతో పాటు జాతీయ స్థాయిలోనూ గుర్తింపు సాధించవచ్చని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు లింగాల భూపాల్ అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని యామిని పదో తరగతి ఫలితాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచి 576 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవడంతో పాటు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో యామినిని ఘనంగా సన్మానించారు. లింగాల భూపాల్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో యామినికి రూ.3,100 నగదు బహుమానం అందజేయడంతో పాటు ఇంగ్లీష్‌తెలుగు నిఘంటువు, భారత రాజ్యాంగం పుస్తకాలను బహుమతిగా అందించారు. యామిని కృషి, పట్టుదల అభినందనీయమని కొనియాడుతూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి యామినిని ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా పట్టుదలతో శ్రమిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచగలరని పేర్కొన్నారు. మండల విద్యాధికారి రాములు మాట్లాడుతూ, యామిని సాధించిన ఫలితం పాఠశాలకు గర్వకారణమని, ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ మాట్లాడుతూ ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు కే. యాదగిరి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఎస్. నర్సింగ్ రావు, కోశాధికారి యల్. రాజు, సలహాదారులు ఎఫ్. రామకృష్ణ, వి. గోవింద్ రాజు, కే. నర్సింహ్మా, సభ్యులు నిరంజన్, కే. రమేష్, నామాల శ్రీనివాస్, జి. సత్యనారాయణ, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నియంత్రణ, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి

**కాప్రా, మే 5(డీడీ9 వార్త):**

కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో భవానీ నగర్‌లో మంగళవారం కమ్యూనిటీ మీటింగ్ నిర్వహించారు. సిఐ భాస్కర్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ సమావేశానికి స్థానిక ప్రజలు, కాలనీ ప్రతినిధులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో పోలీసులు ముఖ్యంగా డ్రగ్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో యువత దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, కాలనీ పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కొత్తగా పరిచయం అయ్యే వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డ్రగ్స్ సరఫరా లేదా వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేస్తే గోప్యతను కాపాడుతూ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళల భద్రతపై మాట్లాడుతూ, ఒంటరిగా ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించాలి, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలి, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపకూడదు, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. చిన్న తప్పిదాలు కూడా ప్రాణనష్టం కలిగించవచ్చని గుర్తుచేశారు. కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలను నియంత్రించడంలో ఎంతో ఉపయోగం ఉంటుందని, ప్రతి వీధిలో కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. చివరగా, ప్రాంతంలో ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, పోలీస్‌ప్రజల సహకారంతోనే నేరాలను అరికట్టగలమని సిఐ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు.



# రాష్ట్ర ఆర్థిక సంఘం ఛైర్మన్‌కు ఘన స్వాగతం

**నిజామాబాద్ జిల్లా, మే 05 (డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఆర్థిక సంఘం ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్యను భీంగల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి ఘనంగా సత్కరించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆర్థిక సంఘం వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆమె, ఛైర్మన్‌కు శాలువా కప్పి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం నిజామాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్ గారిని కూడా మున్సిపల్ ఛైర్‌పర్సన్ మర్యాదపూర్వకంగా కలిశారు. అదనపు కలెక్టర్ కార్యాలయంలో ఆయనకు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# భార్యపై హత్యాయత్నం కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

**నిజామాబాద్ జిల్లా, మే 05 (డీడీ9 వార్త) :**

భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ నిజామాబాద్ న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించింది. పోలీసుల కథనం ప్రకారం.. జక్రాన్‌పల్లి మండలానికి చెందిన మహిళకు, ప్రదీప్ అనే వ్యక్తితో 2023లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ప్రదీప్ అదనపు కట్నం కోసం వేధిస్తూ, మరో మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తుండటంతో దంపతుల మధ్య ఘర్షణలు మొదలయ్యాయి. ఈ క్రమంలో 2025 ఏప్రిల్ 11 రాత్రి ఫోన్ విషయంపై గొడవ జరగగా, ప్రదీప్ తన భార్యను చీరతో మెడకు ఉరివేసి చంపేందుకు ప్రయత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జక్రాన్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టి సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసును విచారించిన న్యాయమూర్తి డి.దుర్గాప్రసాద్ నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష ఖరారు చేశారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్సైలు తిరుపతి, మాలిక్ రహమాన్, మహేష్, లైయన్ ఆఫీసర్ గోవింద్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ రామారావులను పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అభినందించారు. గృహ హింసకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ తీర్పు హెచ్చరికగా నిలుస్తుందని సీపీ పేర్కొన్నారు.

# ప్రభాస్ సినిమా షూటింగ్.. ఘోర ప్రమాదం.. ఒకరి మృతి

- ప్రభాస్ 'ఫౌజీ' సెట్స్ లో నెలకొన్న విషాదం
- షూటింగ్ కు వెళ్తున్న యూనిట్ సభ్యుల కారుకు యాక్సిడెంట్
- డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో ఒకరి మృతి
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

**హైదరాబాద్ మే 05(డీడీ9 వార్త):**

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్ డ్రామా 'ఫౌజీ' సెట్స్‌లో విషాదం నెలకొంది. ఈ ఉదయం షూటింగ్ నిమిత్తం వెళ్తున్న యూనిట్ సభ్యుల కారు హైదరాబాద్ శివార్లలోని అబ్దుల్లాపూర్ మెట్ వద్ద ప్రమాదానికి గురైంది. కారు అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మరణించగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. సినిమా షూటింగ్ పనుల్లో బిజీగా ఉన్న సమయంలో తమ సహచరుడు మరణించాడనే సమాచారంతో చిత్ర యూనిట్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. మరోవైపు, సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ సినిమా యూనిట్‌లో ఈ ఘటన విషాద ఛాయలను నింపింది. మృతుడి కుటుంబానికి చిత్ర బృందం తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.



# ఎసిబి కి చిక్కిన అవినీతి చేప

- 20,000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి

**తలకొండపల్లి మే 05(డీడీ9 వార్త):**



మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్న కార్యదర్శి ఎం శరత్ కుమార్ 20000 లంచం తీసుకుంటుండగా ఎసిబి రంగారెడ్డి డిఎస్పి ఏపీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వెల్జాల్ సెక్రటరీ ఎం.శరత్ కుమార్ విషయాలను మీడియాతో వెల్లడించారు.ఒక వ్యక్తి ప్లాట్‌లో పేరు మార్చిడి అనంతరం తమ వద్ద 30.వేలు డిమాండ్ చేసి 20వేలు ఇస్తుండగా ఎసిబికి రెడ్ హ్యాండెండ్‌గా పట్టుబడ్డాడని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

## పీఎస్ఎల్ ట్రోఫీ గెలిచిన బాబర్..
# రోహిత్ శర్మలా నడిచిన వైనం..

- **పాకిస్థాన్ సూపర్ లీగ్ 2026 టైటిల్‌ను గెలుచుకున్న పెషావర్ జల్మీ**
- **ఫైనల్‌లో హైదరాబాద్ కింగ్స్‌మెన్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం**
- **ట్రోఫీ అందుకునే క్రమంలో రోహిత్ శర్మ స్లో-వాక్‌ను అనుకరించిన కెప్టెన్ బాబర్ ఆజం**
- **బాబర్ నడకపై సోషల్ మీడియాలో మీమ్స్ ఫెస్టివల్**

**డిడి9 వార్త:**

పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026లో కెప్టెన్‌గా పెషావర్ జల్మీ జట్టుకు బాబర్ ఆజం టైటిల్ అందించాడు. లాహోర్‌లోని గడ్డాఫీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ కింగ్స్‌మెన్‌పై పెషావర్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి ట్రోఫీని కైవసం చేసుకుంది. అయితే, ఈ గెలుపు కన్నా ఒక సరదా కారణంతో బాబర్ ఇప్పుడు వార్తల్లో నిలుస్తున్నాడు. భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను అనుకరించి అతను సోషల్ మీడియాలో వైరల్‌గా మారాడు.మ్యాచ్ అనంతరం విజయోత్సవ వేడుకల్లో భాగంగా ట్రోఫీని అందుకునేందుకు బాబర్‌ను వేదికపైకి పిలిచారు. ఆ సమయంలో అతను టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఐకానిక్ స్లోవాక్ పోజును అనుకరించాడు. కావాలనే అతి నెమ్మదిగా నడుస్తూ రోహిత్‌ను ఇమిటేట్ చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు క్షణాల్లో వైరల్ అవ్వగా, సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువెత్తాయి.

ఇక, మ్యాచ్ విషయానికొస్తే, ఫైనల్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పెషావర్ జల్మీ అద్భుతంగా రాణించింది. ఆరోన్ హార్డీ నాలుగు వికెట్లతో చెలరేగడంతో హైదరాబాద్ కింగ్స్‌మెన్ జట్టు 129 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం 130 పరుగుల లక్ష్య ఛేదనలో పెషావర్ జట్టు 15.2 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. హార్డీ అజేయంగా 56 పరుగులు చేయగా, అబ్దుల్ సమద్ 48 పరుగులతో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ గెలిచిన అనంతరం బాబర్ మాట్లాడుతూ.. "ఈ విజయం నాకు, పెషావర్ జల్మీ జట్టుకు, మా అభిమానులకు చాలా గొప్పది. టోర్నమెంట్ ఆద్యంతం మా జట్టు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడు విభాగాల్లోనూ అద్భుతంగా రాణించింది. ప్రతి ఆటగాడు తమకు ఇచ్చిన ప్రణాళికను సరిగ్గా అమలు చేశారు. ప్రతి మ్యాచ్‌కూ పక్కా ప్రణాళికతో ముందుకు సాగాం. దేవుడి దయతో ఫైనల్ గెలిచాం. మా యాజమాన్యం కూడా మాకు పూర్తి మద్దతు ఇచ్చింది" అని తన సంతోషాన్ని పంచుకున్నాడు.





## మా దగ్గర సమాధానం లేదు..
# మాకు కొంచెం అదృష్టం కావాలి

- **ముంబై ఇండియన్స్ చేతిలో లక్నో సూపర్ జెయింట్స్ ఓటమి**
- **అద్భుత ఆరంభం లభించినా ప్రయోజనం లేకపోయిందని పంత్ వ్యాఖ్య**
- **10-15 పరుగులు తక్కువ చేశామని అంగీకరించిన లక్నో కెప్టెన్**
- **ఇది లక్నోకు వరుసగా ఆరో ఓటమి, పట్టికలో అట్టడుగు స్థానం**
- **మిగిలిన మ్యాచ్‌లలోనైనా అదృష్టం కలిసిరావాలని పంత్ ఆకాంక్ష**

**డిడి9 వార్త:**

ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ (LSG) ఓటముల పరంపర కొనసాగుతోంది. సోమవారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ ఆ జట్టు ఓటమి పాలైంది. అద్భుతమైన ఆరంభం లభించినప్పటికీ మ్యాచ్ ఎలా చేజారిందో అర్థం కావడం లేదని, తమకు కాస్త అదృష్టం కూడా కావాలని లక్నో కెప్టెన్ రిషభ్ పంత్ నిస్సహాయత వ్యక్తం చేశాడు.

వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో పవర్‌ప్లేలో విధ్వంసం సృష్టించింది. నికోలస్ పూరన్ (21 బంతుల్లో 63), మిచెల్ మార్ష్ (25 బంతుల్లో 44) మెరుపులతో 6 ఓవర్లలోనే 90/1 స్కోరుతో పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే, కార్బిన్ బాష్ వేసిన ఒకే ఓవర్లో వీరిద్దరూ ఔట్ కావడంతో లక్నో ఇన్నింగ్స్ గాడితప్పింది. అయినప్పటికీ, 5 వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో రోహిత్, రికెల్టన్ అర్ధ సెంచరీలతో రాణించడంతో ముంబై ఇండియన్స్ 18.4 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి సునాయాసంగా విజయం సాధించింది.

మ్యాచ్ అనంతరం పంత్ మాట్లాడుతూ "మేము ఆడిన తీరుకు ఇంకా ఎక్కువ పరుగులు చేసి ఉండాల్సింది. కచ్చితంగా 1015 పరుగులు తక్కువ చేశాం. ఇలాంటి వికెట్‌పై బౌలర్లను నిందించలేం. వారు బాగానే ప్రయత్నించారు. మాకు కొంచెం అదృష్టం కావాలి. గెలవాలంటే మా నుంచి మరింత మెరుగైన ప్రదర్శన అవసరం" అని పేర్కొన్నాడు. ఈ సీజన్‌లో లక్నోకు ఇది వరుసగా ఆరో ఓటమి. దీంతో ఆ జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలోనే కొనసాగుతోంది.



# 'నన్ను టెస్ట్ ప్లేయర్ అన్నారు.. టీ20 ఆడటం రాదన్నారు'.. కేఎల్ రాహుల్ భావోద్వేగం..

**డిడి9 వార్త:**

ప్రస్తుత క్రికెట్ ప్రపంచంలో క్లాసిక్ బ్యాటింగ్‌కు నిలువుటద్దం కేఎల్ రాహుల్. కర్ణాటకకు చెందిన ఈ కుడిచేతి వాటం బ్యాటర్, తన కెరీర్ ఆరంభంలో సాంప్రదాయ టెస్ట్ క్రికెట్‌కు మాత్రమే పనికొస్తాడని విమర్శలు ఎదుర్కొన్నాడు. కానీ. పట్టుదలతో తన శైలిని మార్చుకుని మూడు ఫార్మాట్లలోనూ అత్యుత్తమ ఆటగాడిగా ఎదిగాడు. ముఖ్యంగా ఐపీఎల్ వంటి వేదికలపై భారీ స్కోర్లతో పాటు వేగంగా పరుగులు సాధిస్తూ విమర్శకుల నోళ్లు మూయించాడు. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడుతున్న రాహుల్, క్రీజులో ఉంటే ఆ ఫీల్డర్లకు పని చెప్పడం ఖాయం. మైదానంలో చురుకుగా ఉంటూ భారీ సిక్సర్లతో విరుచుకుపడటం అతని ప్రత్యేకత. గత పదేళ్ల ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన రాహుల్, ఇప్పుడు మరింత పరిణతి చెందిన ఆటగాడిగా కనిపిస్తున్నాడు.

అయితే తాజాగా 'జియోస్టార్' టాక్ షోలో పాల్గొన్న రాహుల్.. తన అంతరంగంలోని భావాలను పంచుకున్నాడు. తనపై ఉన్న "టెస్ట్ స్పెషలిస్ట్" అనే ముద్రను చెరిపివేసి, పరిమిత ఓవర్ల క్రికెట్‌లో నిరూపించుకోవడం పట్ల గర్వంగా ఉందని తెలిపాడు. టెస్ట్ క్రికెట్‌కు మాత్రమే నువ్వు ఆడగలవు.. టీ20 క్రికెట్‌కు పనికి రావు అని చాలా మంది అంటుంటే ఎంతో బాధపడ్డట్లు చెప్పుకొచ్చాడు. పదేళ్ల క్రితం టీ20 జట్టులో చోటు దక్కించుకోవడం తనకు కలగా ఉండేదని, కానీ నిరంతర శ్రమతో ఆ అడ్డంకులను అధిగమించానని చెప్పాడు. ఈ సీజన్ ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌పై 64 బంతుల్లోనే 152 పరుగులు చేసిన అద్భుత ఇన్నింగ్స్ గురించి ప్రస్తావిస్తూ.. ఫలితం అనుకూలంగా రాకపోయినా తన ఆటతీరుపై తనకు సంతృప్తి ఉందన్నాడు.

అంతేకాకుండా.. తండ్రిగా మారిన తర్వాత తన జీవితంలో వచ్చిన మార్పుల గురించి రాహుల్ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. గతేడాది కుమార్తె పుట్టిన తర్వాత తన ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని తెలిపాడు. "కుమార్తె కౌగిలింత, ఆమె చిరునవ్వు నా బాధలను మరిపిస్తాయి. తండ్రిగా మారడం నా క్రికెట్ పట్ల నా దృక్పథాన్ని మార్చింది. ఇప్పుడు నేను ఆటను అతిగా ఆలోచించడం లేదు. కేవలం ఆ 45 గంటలు మైదానంలో ఉత్సాహంగా ఆడుతున్నాను" అని చెప్పుకొచ్చాడు.




34 ఏళ్ల వయసులో ఉన్న రాహుల్, తనకింకా కెరీర్ మిగిలే ఉందని, రాబోయే రోజుల్లో దేశానికి, తన టీమ్‌కు మరిన్ని ట్రోఫీలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపాడు. ఆటలో తప్పులు సహజమని, కానీ వాటి నుంచి నేర్చుకుని ముందడుగు వేయడమే అసలైన క్రీడా స్ఫూర్తి అని ఆయన వ్యాఖ్యానించాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో 185.84 సగటుతో 433 పరుగులు చేసి సెకండ్ లీడింగ్ స్కోరర్‌గా రాహుల్ కొనసాగుతున్నాడు.




## ఆకాశమే హద్దుగా చెలరేగిన రోహిత్ శర్మ..
# ఆ రికార్డులన్నీ పటాపంచల్..

**డిడి9 వార్త:**

ఐపీఎల్ 2026లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన 47వ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఓపెనర్లు భారీ స్కోరు సాధించారు. గాయం కారణంగా కొన్ని మ్యాచ్‌లకు దూరమైన రోహిత్ శర్మ, ఈ మ్యాచ్‌లో తిరిగి జట్టులోకి వచ్చి బాధ్యతాయుతంగా ఆడాడు. ఓపెనర్ రియాన్ రికెల్టన్ 32 బంతుల్లో 83 పరుగులు చేసి అవుట్ కాగా.. రోహిత్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగి 44 బంతుల్లో 84 పరుగులు చేసి మహమ్మద్ షమీ బౌలింగ్‌లో పెవిలియన్ కు చేరాడు. వీరిద్దరూ కలిసి మొదటి వికెట్‌కు 143 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ముంబై ఇండియన్స్ చరిత్రలో అత్యధిక భాగస్వామ్యాల జాబితాలో ఇది ఐదవ స్థానంలో నిలిచింది.

ఈ ఇన్నింగ్స్ ద్వారా రోహిత్ శర్మ కొన్ని కీలక రికార్డులను నమోదు చేశాడు. రోహిత్ తన హాఫ్ సెంచరీని 27 బంతుల్లో పూర్తి చేసుకున్నాడు, ఇది అతడి ఐపీఎల్ కెరీర్‌లో నాలుగో వేగవంతమైన అర్ధ సెంచరీ. గతంలో కోల్‌కతాపై 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసిన రికార్డు కూడా రోహిత్ పేరిట ఉంది. అలాగే, ముంబై ఇండియన్స్ తరపున అత్యధిక సార్లు (3 సార్లు) 100+ పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన జోడిగా రోహిత్ శర్మ మరియు రియాన్ రికెల్టన్ రికార్డు సృష్టించారు. గతంలో రోహిత్ - ఇషాన్ కిషన్, పార్థివ్ పటేల్ - లెండిల్ సిమన్స్ వంటి జోడీలు రెండుసార్లు మాత్రమే ఈ ఘనత సాధించాయి. ముంబై ఇండియన్స్ 14 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. ప్రస్తుతం ముంబై విజయం సాధించాలంటే 35 బంతుల్లో 51 పరుగులు చేయాల్సి ఉంది. క్రీజులో సూర్యకుమార్ యాదవ్‌తో పాటు తిలక్ వర్మ ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో రికెల్టన్ 8 సిక్సర్లు, రోహిత్ 7 సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచారు. ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ గెలిచే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి.

## దు:ఖంలో సీఎస్కే ఫ్యాన్స్..
# ఐపీఎల్ 2026 నుంచి ధోనీ అవుట్!

**డిడి9 వార్త:**

ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజం ఎంఎస్ ధోని ఈ సీజన్ (IPL 2026) మొత్తానికి దూరమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. పిక్క గాయం కారణంగా ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడని ధోని, తాజాగా మంగళవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరగనున్న కీలక పోరుకు కూడా అందుబాటులో లేకపోవడంతో అభిమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత మ్యాచ్‌ల వరకు ధోని మైదానానికి రాకపోయినా జట్టుతో పాటే ఉన్నాడు. అయితే ఢిల్లీతో మ్యాచ్ కోసం సీఎస్కే జట్టు ఢిల్లీకి పయనమవగా, ధోని వారితో కలిసి వెళ్లలేదని సమాచారం. ఈ విషయాన్ని సీఎస్కే బౌలింగ్ సలహాదారు ఎరిక్ సిమన్స్ స్వయంగా ధృవీకరించారు. "ధోని ప్రస్తుతం మాతో లేడు. ఆయన ఇంకా గాయం నుంచి కోలుకుంటున్నారు" అని సిమన్స్ పేర్కొన్నారు.

**ముగిసిన శకం?**

జట్టుతో పాటు ధోని ప్రయాణించకపోవడంతో ఆయన ఈ సీజన్ నుంచి పూర్తిగా తప్పుకున్నట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. 44 ఏళ్ల వయసులో గాయం తిరగబెట్టడం, మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించలేకపోవడంతో ఇదే ఆయనకు చివరి ఐపీఎల్ అయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. మైదానంలోకి దిగకుండానే ధోని రిటైర్మెంట్ ప్రకటించవచ్చని వస్తున్న ఊహాగానాలు సీఎస్కే అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయి. ఇదే సమయంలో ధోని సేవలు అందుబాటులో లేకపోవడం చెన్నై జట్టు ప్రదర్శనపై కూడా ప్రభావం చూపుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు జరిగిన 9 మ్యాచ్‌ల్లో కేవలం 04 మ్యాచ్‌లు గెలిచి, 05 మ్యాచ్‌లు ఓడిపోయింది. ప్రస్తుతం ఈ జట్టు పాయింట్ల పట్టికలో 6వ స్థానంలో కొనసాగుతుంది. చెన్నై ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే మిగిలిన మ్యాచ్‌లు అత్యంత కీలకం. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ధోని గైర్హాజరు జట్టుకు పెద్ద లోటుగా మారింది. మరి ధోనీ ఈ సీజన్ చివరలోనైనా మైదానంలో కనిపిస్తాడా లేక ఇలాగే వీడ్కోలు పలుకుతాడా అనేది వేచి చూడాలి.




## ఐపీఎల్‌లో వరుస ఓటములు.. అయినా ప్రపంచ రికార్డు
# సొంతం చేసుకున్న ముంబై ఇండియన్స్...

**డిడి9 వార్త:**

ప్రపంచ క్రికెట్ చరిత్రలో ముంబై ఇండియన్స్ (MI) సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. టీ20 ఫార్మాట్‌లో 50,000 పరుగుల మైలురాయిని అందుకున్న ప్రపంచంలోనే మొట్టమొదటి జట్టుగా రికార్డు సృష్టించింది. 2008లో ఐపీఎల్ అరంగేట్రం చేసిన ముంబై, ఇప్పటివరకు 308 మ్యాచ్‌ల్లో 50,003 పరుగులు సాధించి అగ్రస్థానంలో నిలిచింది.ఈ జాబితాలో ఇతర జట్ల వివరాల్లోకి వెళ్తే.. సోమర్‌సెట్ (ఇంగ్లాండ్): 48,244 పరుగులతో రెండో స్థానం, ఆర్సీబీ (RCB) 47,304 పరుగులతో మూడో స్థానం, సీఎస్కే (CSK) 46,438 పరుగులతో నాలుగో స్థానం, టీమ్ ఇండియా 45,241 పరుగులతో ఐదో స్థానంలో నిలిచింది (టాప్5లో ఉన్న ఏకైక అంతర్జాతీయ జట్టు).



ముంబై ఇండియన్స్ ఐదుసార్లు ఐపీఎల్ టైటిళ్లను, రెండుసార్లు ఛాంపియన్స్ లీగ్ ట్రోఫీలను గెలుచుకుంది. 2008లో సచిన్ టెండూల్కర్‌ను ఐకాన్ ప్లేయర్‌గా ఎంపిక చేయడంతో వీరి ప్రయాణం మొదలైంది. హర్భజన్ సింగ్, రికీ పాంటింగ్ వంటి దిగ్గజాలు జట్టును నడిపించినా.. రోహిత్ శర్మ సారథ్యంలో ముంబై స్వర్ణయుగాన్ని చూసింది. రోహిత్ నాయకత్వంలో 2013, 2015, 2017, 2019 మరియు 2020లో ముంబై విజేతగా నిలిచింది. 2024 సీజన్‌లో హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే.. ఆ సీజన్‌లో జట్టు చివరి స్థానంలో నిలిచింది. 2025లో రెండో క్వాలిఫైయర్ వరకు వెళ్లినా పంజాబ్ చేతిలో ఓడి నిష్క్రమించింది. ప్రస్తుత 2026 సీజన్ ముంబైకి కలిసిరావడం లేదు. రోహిత్ శర్మ గాయం కారణంగా జట్టుకు దూరం కావడంతో, కేవలం 2 విజయాలతో పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో కొనసాగుతోంది. విజయాలు లేకపోయినా, పరుగులు సాధించడంలో మాత్రం ముంబై తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

## ప్రతి ప్రేమకూ ఓ చీకటి కోణం ఉంటుంది..

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ అవికా గోర్, నటుడు నందు జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'అగ్లీ స్టోరీ' . చిన్నారి పెళ్లికూతురుగా తెలుగువారి మనసు గెలుచుకున్న అవికా, ఇటీవల తన వ్యక్తిగత జీవితంలో వివాహం చేసుకుని సెటిల్ అయిన సంగతి తెలిసిందే. పెళ్లి తర్వాత ఆమె సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తూ, వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతోంది. ఈ క్రమంలో అవికా నటిస్తున్న ఈ రొమాంటిక్ థ్రిల్లర్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ప్రణవ్ స్వరూప్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. సినిమా ప్రమోషన్లలో భాగంగా చిత్ర యూనిట్ వరుస అప్‌డేట్స్‌తో అలరిస్తోంది. తాజాగా అవికా గోర్ సోషల్ మీడియా వేదికగా ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. మే 6న ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు ఆమె వెల్లడించింది. అంతేకాకుండా, సినిమా విడుదల తేదీలో జరిగిన మార్పును కూడా ఆమె అధికారికంగా ప్రకటించింది. నిజానికి 'అగ్లీ స్టోరీ' మే 15న విడుదల కావాల్సి ఉంది. అయితే, అదే సమయంలో స్టార్ హీరోయిన్ సమంత నటిస్తున్న 'మా ఇంటి బంగారం' కూడా విడుదల కాబోతుండటంతో.. బాక్సాఫీస్ వద్ద అనవసరమైన పోటీ ఉండకూడదనే ఉద్దేశంతో, 'అగ్లీ స్టోరీ' మేకర్స్ తమ సినిమాను వారం రోజులు వాయిదా వేశారు. సమంత సినిమాకు లైన్ క్లియర్ చేస్తూ, ఈ చిత్రాన్ని మే 22న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని తెలుపుతూ అవికా ఒక స్పెషల్ పోస్టర్‌ను షేర్ చేసింది.
విడుదల తేదీని ప్రకటిస్తూ షేర్ చేసిన ఈ పోస్టర్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఇందులో హీరో నందు, అవికాను ప్రేమగా హత్తుకుని ఉండగా.. ఆమె ముఖంలో మాత్రం ఏదో తెలియని ఆందోళన, భయం కనిపిస్తున్నాయి. రొమాంటిక్ థ్రిల్లర్ కావడంతో ఈ పోస్టర్ సినిమాలోని నిగూఢమైన రహస్యాలను సూచిస్తోంది. దీనికి తోడు "ప్రతి ప్రేమకూ ఒక చీకటి కోణం ఉంటుంది... మరి ఈ ప్రేమ అత్యంత కఠోరమైన వాస్తవం" అంటూ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేస్తోంది. రియా జియా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సీహెచ్ సుభాషిణి, కొండా లక్ష్మణ్ నిర్మిస్తున్న.. థ్రిల్లర్ జోనర్ ఇష్టపడే ప్రేక్షకులకు 'అగ్లీ స్టోరీ' ఖచ్చితంగా ఒక కొత్త అనుభూతిని ఇస్తుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.



## ఊపిరిపీల్చుకోవడానికి వెనక్కి తగ్గుతున్నా..

టాలీవుడ్ యంగ్ టాలెంట్ కామాక్షి భాస్కర్ల తన సహజమైన నటనతో అనతి కాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా 'మా ఊరి పొలిమేర' సినిమాలో ఆమె చేసిన డీగ్లామర్ పాత్ర ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుసగా అవకాశాలు దక్కించుకుంటూ, గ్లామరస్ రోల్స్‌లోనూ మెరిసి సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. ఇటీవల అడివి శేష్ 'డెకాయిట్' మూవీలోనూ ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. ప్రస్తుతం ఆమె చేతిలో అగధ, మా ఊరి పొలిమేర3' వంటి క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. కెరీర్ ఇలా ఫుల్ స్వింగ్‌లో ఉన్న సమయంలో కామాక్షి ఒక షాకింగ్ నిర్ణయం తీసుకుంది.తాజాగా కామాక్షి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పెట్టిన ఒక పోస్ట్ ఇండస్ట్రీలో పెద్ద చర్చకు దారితీసింది. తాను నటనకు మరియు కెమెరాకు కొంతకాలం పాటు విరామం ఇస్తున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచింది. వరుస సినిమాలతో బిజీగా ఉన్న సమయంలో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వెనుక ఉన్న బలమైన కారణాన్ని కూడా ఆమె వివరించింది. తన నిర్ణయం గురించి కామాక్షి స్పందిస్తూ.. "నటన మీద విసుగు వచ్చి నేను ఈ బ్రేక్ తీసుకోవడం లేదు. కేవలం నా మానసిక ఆరోగ్యానికి, స్వీయ సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాను. ప్రస్తుతం నాకు ఎలాంటి తొందర లేదు. ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటూ, నా ఉనికిని నేను గుర్తు చేసుకోవాలనుకుంటున్నాను. కొన్నిసార్లు మన లక్ష్యాలను మరింత ఉత్సాహంగా చేరుకోవాలంటే, కొంచెం వెనక్కి తగ్గి శక్తిని కూడగట్టుకోవాలి. అందుకే ఈ విరామం.. కానీ నేను ఎక్కడికీ వెళ్లిపోలేదు, మళ్ళీ వస్తాను" అని చాలా స్పష్టంగా చెప్పుకొచ్చింది.గ్లామర్ ప్రపంచంలో నిరంతరం పని ఒత్తిడిలో ఉండే నటీనటులు తమ వ్యక్తిగత ప్రశాంతత కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం చాలా అరుదు. కామాక్షి తన ఆరోగ్యం కోసం తీసుకున్న ఈ ధైర్యవంతమైన స్టెప్‌ను నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. "మీ ఆరోగ్యం అన్నిటికంటే ముఖ్యం, ప్రశాంతంగా తిరిగి రండి" అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. మరికొందరు ఈ సమయంలో.. అంత మానసిక ఒత్తిడి? ఏంటా అని పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వరుస ప్రాజెక్టులు చేతిలో ఉన్నా కూడా, కెరీర్ కంటే తన మనశ్శాంతికే ఎక్కువ విలువనిచ్చిన కామాక్షి తీరు ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.





## 'టాక్సిక్' వివాదంపై కియారా అద్వానీ క్లారిటీ..

కన్నడ స్టార్, రాకింగ్ స్టార్ యష్ హీరోగా, గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'టాక్సిక్'. 'కేజీఎఫ్' సిరీస్‌తో గ్లోబల్ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న యష్ నటిస్తున్న సినిమా కావడంతో, దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. నిజానికి ఈ చిత్రం జూన్ 4న విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. అయితే, ఈ సినిమా షూటింగ్, స్క్రిప్ట్ విషయంలో గత కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో రకరకాల వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ సినిమాలో యష్ సరసన బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే, చిత్రంలో తనపై చిత్రీకరించిన కొన్ని బోల్డ్ సీన్ల విషయంలో కియారా అభ్యంతరం వ్యక్తం చేస్తోందని, వాటిని సినిమా నుంచి తొలగించాలని ఆమె మూవీ టీమ్‌ను రిక్వెస్ట్ చేసినట్లు ప్రచారం జరిగింది. నటించేటప్పుడు బాగానే ఉన్నా, తాను చేసిన సీన్స్ చూసుకున్న తర్వాత ఆమె తన నిర్ణయాన్ని మార్చుకుందని వార్తలు రావడంతో నెటిజన్లు ఆమెపై విమర్శలు గుప్పించారు.
తనపై వస్తున్న ఈ విమర్శలను గమనించిన కియారా అద్వానీ, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించింది. ఆ వార్తలన్నీ నాన్‌సెన్స్ అని కొట్టిపారేసింది. "టాక్సిక్ సినిమాలో నా పాత్ర గురించి లేదా సీన్ల గురించి వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. అవన్నీ నిరాధారమైన పుకార్లు మాత్రమే. స్క్రిప్ట్ విషయంలో కానీ, బోల్డ్ సీన్ల విషయంలో కానీ నేను చిత్ర యూనిట్‌కు ఎలాంటి అభ్యంతరాలు చెప్పలేదు. కావాలని ఎవరో తప్పుడు వార్తలను సృష్టిస్తున్నారు. వాటిని నమ్మకండి" అని ఆమె స్పష్టత ఇచ్చింది. కియారా క్లారిటీ ఇవ్వడంతో ప్రస్తుతం ఈ వివాదానికి తెరపడినట్లయింది. ఈ క్రేజీ ప్రాజెక్టులో కియారాతో పాటు నయనతార, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హుమా ఖురేషి ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇంతమంది స్టార్స్ ఉండటంతో సినిమాపై హైప్ విపరీతంగా పెరిగింది. పలుమార్లు వాయిదా పడటంతో విడుదల తేదీపై ప్రస్తుతం సందిగ్ధత నెలకొన్నప్పటికీ, యష్ ఫ్యాన్స్ మాత్రం తమ అభిమాన హీరోను వెండితెరపై చూసేందుకు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు.

## మరో రొమాంటిక్ చిత్రంతో అనీత్ పడ్డా ఎంట్రీ

'సైయారా' చిత్రంతో బాలీవుడ్‌తో పాటు తెలుగు ప్రేక్షకుల్లో కూడా ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది యంగ్ బ్యూటీ అనీత్ పడ్డా. తన అందం, నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ అమ్మడు.. ప్రస్తుతం వరుస ఆఫర్లు అందుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగానే.. రీసెంట్‌గా ఓ హారర్ కామెడీ చిత్రాన్ని ఓకే చేసింది. మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా వస్తున్న 'శక్తి శాలిని' చిత్రంలో నటిస్తుంది. బెంగాలీ జానపద కథల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో శక్తి, శాలిని అనే రెండు విభిన్న పాత్రల్లో మెప్పించేందుకు సిద్ధం అవుతున్నది. ఈ చిత్రంతో పాటు ఇప్పుడు మరో ప్రాజెక్టుకు ఓకే చేసింది. తన కొత్త చిత్రానికి సంబంధించిన అప్డేట్ ఇస్తూ.. 'ప్రేమలో పడటానికి సిద్ధంగా ఉండండి! YRF బ్యానర్‌పై అనీత్ పడ్డా నటిస్తున్న రొమాంటిక్ చిత్రం 'సత్రంగా'కు సంబంధించిన అదిరిపోయే పోస్టర్ వచ్చేసింది' అంటూ ఓ క్యూట్ పోస్టర్ షేర్ చేయగా.. ప్రజంట్ ఆ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా.. అహాన్ పాండే ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి మోహిత్ సూరి దర్శకత్వం వహిస్తున్నాడు.



## 'ఆర్‌సీ 17' సెట్స్‌పైకి అప్పుడే!

కథానాయకుడు రామ్‌చరణ్ 'పెద్ది' సినిమాని ఇప్పటికే పూర్తి చేశారు. ఇది జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఇప్పుడు అందరి చూపు ఆయన తదుపరి చిత్రంపై పడింది. 'ఆర్‌సీ 17' వర్కింగ్ టైటిల్‌తో సెట్స్‌పైకి వెళ్లనున్న ఆ సినిమాకి సుకుమార్ దర్శకత్వం వహించనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇప్పటికే ఈ చిత్ర స్క్రిప్ట్ పనులు ఓ కొలిక్కి వచ్చాయని.. సుకుమార్ దీనికి తుది మెరుగులు దిద్దడంలో తలమునకలై ఉన్నారని తెలిసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ సినిమా చిత్రీకరణకు సంబంధించి ఓ ఆసక్తికర కబురు బయటకొచ్చింది. ఈ కొత్త చిత్రాన్ని జులైలో పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మైత్రీకి చెందిన నిర్మాతల్లో ఒకరైన చెర్రీ వెల్లడించారు. 'రంగస్థలం' విజయం తర్వాత చరణ్ సుక్కు కలయికలో రానున్న రెండో చిత్రం కావడంతో ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. దీనికి తగ్గట్లుగానే ఈసారి



సుకుమార్ తనదైన శైలిలో మరో శక్తిమంతమైన మాస్ యాక్షన్ కథను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

## అది నాకు రాసి పెట్టి ఉంది!

హిందీ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రాల్లో 'కల్ హో నా హో' ముందు వరుసలో ఉంటుంది. బాలీవుడ్ అగ్రహీరో షారుక్ ఖాన్, సైఫ్ అలీఖాన్, ప్రీతి జింటా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ రొమాంటిక్ డ్రామాలో నైనా పాత్రలో కనిపించి కుర్రకారుని అలరించింది ప్రీతి. కానీ ఈ పాత్రను మొదట్లో కరీనా కపూర్‌కు ఆఫర్ చేశారట. కొన్ని కారణాల వల్ల ఆమె దీంట్లో భాగం కాకపోవడంతో.. ఆ పాత్రలో ప్రీతిని తీసుకుందట చిత్రబృందం. దీనిపై అప్పట్లోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రీతి స్పందిస్తూ.. "మీరు ఓ షాప్‌కి వెళ్లి ఒక జీన్స్ ప్యాంట్‌ను వేసుకొని చూస్తారు. అది మీకు సరిగ్గా సరిపోతుంది. కానీ దాన్ని మీరు కొనకపోతే.. అది మీ జీన్స్ కాదని అర్థం. ఆ తర్వాత వచ్చే వ్యక్తి వాటిని వేసుకొని చూసి, కొనుగోలు చేసుకుంటే అవి ఆ వ్యక్తికే చెందినవి అవుతాయి. ఇది కూడా అంతే.. కరీనా మొదటి ఎంపికే అయినా.. అది నాకు రాసి పెట్టి ఉంది కాబట్టి 'కల్ హో నా హో'లో నటించాను'' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది.



## సల్మాన్‌తో రొమాన్స్ చేయబోతున్న కరీనా కపూర్..

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత వేగంగా సినిమాలు చేస్తూ అభిమానులను ఖుషీ చేస్తున్నారు. టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లితో ఒక భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కించిన ఆయన, మరో క్రేజీ కాంబినేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పలు వార్తలు వైరల్ అవుతున్నాయి. 'ది ఫ్యామిలీ మ్యాన్, ఫర్జీ వంటి వెబ్ సిరీస్‌లతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న టాలెంటెడ్ డైరెక్టర్స్ రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో సల్మాన్ ఒక సినిమా చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా గురించి వినిపిస్తున్న విశేషాలు సినీ వర్గాల్లో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. హాలీవుడ్ సూపర్ హిట్ చిత్రం 'హ్యాంకాక్' తరహాలో ఈ సినిమా ఉండబోతోందట. సూపర్ హీరో ఎలిమెంట్స్‌కు రాజ్ అండ్ డీకే మార్క్ కామెడీని జోడించి ఈ కథను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఒక అసాధారణ శక్తి ఉన్న వ్యక్తి సమాజంలో సామాన్యుడిగా ఎలా ఉంటాడు? తన శక్తులతో ఎలాంటి విన్యాసాలు చేస్తాడు? అనే అంశాలను చాలా వినోదాత్మకంగా, కొత్త కోణంలో ఈ సినిమాలో చూపించబోతున్నారట.
తాజాగా, ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో సల్మాన్ ఖాన్ సరసన స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ నటించబోతున్నట్లు సమాచారం. వీరిద్దరూ గతంలో క్యోంకి, బాడీగార్డ్, బజరంగీ భాయిజాన్ వంటి సూపర్ హిట్ సినిమాల్లో నటించి మెప్పించారు. సుమారు 11ఏళ్ల విరామం తర్వాత ఈ హిట్ జోడీ మళ్ళీ వెండితెరపై సందడి చేయబోతుండటంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. అయితే ఈ చిత్రాన్ని అతుల్ అగ్నిహోత్రి నిర్మిస్తుండగా, టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామి కాబోతున్నట్లు తెలుస్తోంది. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక విలువలలో రూపొందనున్న ఈ సినిమా షూటింగ్ అక్టోబర్‌లో ప్రారంభం కానుందట. రాజ్ అండ్ డీకే శైలి మేకింగ్, సల్మాన్ ఖాన్ మాస్



ఇమేజ్ తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడాదే షూటింగ్ మొదలుపెట్టి వచ్చే ఏడాది సమ్మర్ లేదా ఆ తర్వాతి సీజన్‌లో సినిమాను విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.